క్లుప్తంగా

ఘనంగా గురుపూజోత్సవం

కోట: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కోట మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చిన్మయా మిషన్‌లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ఆర్‌ఎస్ఎస్ తిరుపతి జిల్లా కార్యదర్శి ధనుంజయ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలు దేశభక్తి గీతాలు ఆలపించారు. తాము గురువుగా భావించే భగవాధ్వజానికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పేర్నాటి ఆనంద్‌రెడ్డి, మాదన కోటేశ్వరరావు, వెంకటరమణయ్య, అంబరీష పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న కార్యాలయాల భవనాలు



తహసీల్దార్ కార్యాలయంలోని ఓ గదిలో దెబ్బతిన్న శ్లాబ్

దొరవారిసత్రం : స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల భవనాల పైకప్పు పెచ్చులు ఊడి కింద పడుతుండంతో అధికారులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఈ భవనాలు నిర్మించి 22 ఏళ్లు దాటింది. వాటి నిర్వహణను ఆయా శాఖల అధికారులు పట్టించుకోలేదు. దీంతో పైకప్పు పెచ్చులు పెచ్చులుగా ఊడి పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్లాబ్‌కు మరమ్మతుల చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు గ్రీవెన్స్ డే

చిల్లకూరు : గూడూరు మున్సిపాలిటీ, గూడూరు మండలం, చిల్లకూరు మండలాల ప్రజలు సమస్యలు తెలుసుకుని పరిష్కరించేలా సోమవారం మెగా గ్రీవెన్స్‌డేను గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్నట్లు చిల్లకూరు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన ఆదివారం గ్రీవెన్స్‌డేపై వీఆర్వోలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మెగా గ్రీవెన్స్ డేను గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నందున ప్రతి ఒక్కరూ తప్పక హాజరుకావాలన్నారు. అలాగే ఈ గ్రీవెన్స్ డేకు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కూడా హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని కోరారు.

చిన్నారులకు భోజనం ప్యాకెట్లు అందజేత



చిన్నారులకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు

దొరవారిసత్రం : నెలబల్లిలోని ఎస్టీ కాలనీకి చెందిన చిన్నారులకు ఆదివారం శ్రీకృష్ణా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజనం ప్యాకెట్లు అందజేశారు. తిరుపతి పట్టణానికి చెందిన రూపేష్, హేమావతి దంపతుల కుమారుడు లవిన్ క్రిస్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేపట్టినట్లు సంస్థ నిర్వాహకులు నాగరాజు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ సాధనే ఎమ్మార్పీఎస్ లక్ష్యం



వేడుకలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నాయుడుపేట టౌన్ : ఎస్సీ వర్గీకరణ సాధించడమే ఎమ్మార్పీఎస్ ప్రధాన లక్ష్యమని ఆ సంఘం సూళ్లూరుపేట నియోజవర్గ అధ్యక్షుడు కే రవి తెలిపారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని అగ్రహార పేటలోని అ రుంధతీయ వాడలో ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాచవరం శ్రీనివాసులు, మొండెం రవి, కొండాపురం శ్రీనివాసులు, సీహెచ్ రవీంద్రనాథ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగికి సన్మానం



శివకుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కోట: స్థానిక ఎస్సీ గురుకుల పాఠశాలలో ల్యాబ్ అటెండర్‌గా పనిచేస్తున్న శివదానం శివ కుమార్ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను ఆదివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, బంధుమిత్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శివకుమార్ విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసి అందరి మన్ననలు పొందారని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో శ్రీనివాసులు, గూడలి ఉపసర్పంచ్ పల్లెమల్లు విజయసారథిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా దాబాలు



జాతీయ రహదారి పక్కనే పట్రగుంట సమీపంలో దాబా

చిల్లకూరు: జాతీయ రహదారి వెంబడి ఇష్టానుసారంగా దాబాలు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మద్యం ఏరులై ప్రవహిస్తున్నా.. అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. జాతీయ రహదారిపై దూర ప్రాంతాలకు వెళ్లే వాహన చోదకులు కొంత సేపు విశ్రాంతి తీసుకునేందుకు రోడ్డు పక్కనే ఉండే దాబాలు, హోటళ్లను ఎంచుకుంటూ ఉంటారు. కొన్ని గంటల పాటు అక్కడే సేదతీరి మళ్లీ ప్రయాణం కొనసాగిస్తుంటారు. అయితే ఈ ప్రాంతంలోని ధాబాల్లో మందుబాబు హవా సాగుతోంది. అలాగే ఆహార పదార్థాలు సైతం క్వాలిటీగా ఉండడంలేదు. దీనిపై ప్రశ్నించిన వాహన చోదకులపై ధాబాల నిర్వాహకులు దాడులకు సైతం దిగుతున్నారు.

ఇబ్బడిముబ్బడిగా..

జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన దాబాల్లో చాలా వాటికి అనుమతులు లేవు. పైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని దర్జాగా దాబాలు నిర్వహించుకుంటున్నారు. దీనిపై పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేవారే కరువయ్యారు. అలాగే దాబా ఏర్పాటు చేసే సమయంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పరిశీలించి ఆ ప్రాంతంలో తాగునీరు, పరిశుభ్రత ఉందా అనే విషయాలను తనిఖీ చేయాలని. అయితే ఇక్కడ అలాంటి నిబంధనలు ఏవీ అమలు కావడం లేదు. ఎప్పుడైనా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఆయా దాబాలకు వెళితే మామూళ్లు ఇచ్చి పంపేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాబాల్లో నిత్యం మద్యం విక్రయాలకు కొదవ ఉండదు. ఇక్కడే మద్యం సేవించిన యువకులు కొంత మంది లారీ డ్రైవర్లుతో వివాదాలకు దిగుతుండడంతో తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. అయినప్పటికీ పోలీసులు కూడా ఇటువైపు రావడంలేదు. ఇప్పటికైన ఆయాశాఖల అధికారులు స్పందించి, దాబాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



క్రీడాకారులకు అనువుగా స్టేడియం నిర్మాణం



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట కేంద్రంగా అన్ని క్రీడలు నిర్వహించేలా స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె ఆదివారం స్థానిక షాదీ మంజిల్‌లో జిల్లా స్థాయి తైక్వాండో క్రీడా పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నాయుడుపేటలో ఎంతో మంది జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడాకారులు ఉన్నారని తెలిపారు. వారికి అనువుగా ప్రభుత్వ స్టేడియం లేదన్నారు. పట్టణంలో ప్రభుత్వ స్థలంలో స్టేడియం నిర్మించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంతకుముంద ఆమె తైక్వాండో పోటీలకు హాజరైన 200 మంది పరిచయం చేసుకున్నారు. తైక్వాండో క్రీడా పోటీలను అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి సీహెచ్ వేణుగోపాల్, జిల్లా కోశాధికారి, అర్గనైజింగ్ సెక్రటరి ఉయ్యాల పవన్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీ శ్రీనివాసులు, పలువురు కోచ్‌ల సారధ్యంలో నిర్వహిస్తున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవిణ్ కుమార్, ఆకుల కుబేరు మణి, పసల చెంగయ్య, పాలూరు భాస్కర్, చెవూరి చెంగయ్య, తైక్వాండో అసోసియేషన్ నాయకులు పి.సాయి, లక్ష్మీ నారాయణ, సి.సాయి, నాయబ్ రసూల్, అబ్దుల్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

10న పోలయ్యస్వామి ఆరాధన ఉత్సవాలు

దక్కిలి : మండలంలోని దేవునివెల్లంపల్లిలో వెలసిన స్తంభాల గిరీశ్వరయ్యస్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీన అవధూత పోలయ్య స్వామి ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో నూతలపాటి శ్రీధర్ నాయుడు తెలిపారు. 10వ తేదీ ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 6 గంటలకు స్వామి, అమ్మవార్లకు అభిషేకం, 7 గంటలక కలశ స్థాపన, 9 గంటలకు హారతి, ప్రసాద వినియోగం, 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 4 గంటలకు అగ్నిగుండ యోగశాల వద్ద గణపతి పూజ, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు కంకణధారణ, 7 గంటలకు పండరి భజన, 8 గంటలకు అన్నదానం , రాత్రి 11 గంటలకు స్వామి వారి అగ్నిగుండంలో భక్తుల ప్రవేశం, రాత్రి 12 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వృద్ధాశ్రమానికి ఫ్యాన్లు వితరణ



ఫ్యాన్లు అందజేసిన విద్యార్థినితో చారిటీస్ నిర్వాహకులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం చారిటీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి ఒక విద్యార్థిని తన పాకెట్ మనీతో మూడు సీలింగ్ ఫ్యాన్లు వితరణ చేసింది. స్థానిక వివేకానంద కోచింగ్ సెంటర్‌లో చదువుతున్న విద్యార్థిని మోనిషా తన పుట్టిన రోజును పురస్కరించుకుని వృద్ధులకు సేవ చేయాలనే తలచింది. తనకు తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీ నుంచి మూడు సీలింగ్ ఫ్యాన్లు కొనుగోలు చేసి వృద్ధాశ్రమానికి అందజేసింది. కోచింగ్ సెంటర్ కన్వీనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి వృద్ధులకు సాయం అందించాలని కోరారు. అనంతరం మౌనిషాను వృద్ధులు ఆశీర్వదించారు.

చిల్లకూరులో యాంకర్ సిరి



సందడి చేస్తున్న యాంకర్ సిరి హనుమంత్

చిల్లకూరు : మండల కేంద్రమైన చిల్లకూరు పోలీసు స్టేషన్ సమీపంలో ఏర్పాటుచేసిన ఒక ప్రైవేట్ వెంచర్‌కు ఆదివారం భూమి పూజ చేశారు. ఇందులో యాంకర్ సిరి హనుమంత్ పాల్గొని సందడి చేశారు. ఆమెను చూడడానికి గూడూరు పట్టణ, చిల్లకూరులోని అభిమానులు అక్కడికి చేరుకోవడంతో సందడి నెలకొంది.

న్యాయవిద్య నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ



అకాడమీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న న్యాయమూర్తులు

తిరుపతి లీగల్: న్యాయవిద్య నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ అని మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంప్రసాద్ తెలిపారు. తిరుపతిలో ఆదివారం నూతనంగా ఎస్ఎల్ జ్యుడిషియల్ సర్వీసెస్ అకాడమీని న్యాయ మూర్తులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో న్యాయమూర్తులకు వివిధ చట్టాలు, పరిపాలనపై అవగాహన కల్పించడానికి జ్యుడిషియల్ అకాడమీలు ఉన్నాయన్నారు. తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి ఎం .గురునాథ్ మాట్లాడుతూ రాయలసీమ, కోస్తా జిల్లాలకు చెందిన న్యాయవాదులు జడ్జి పోస్టులకు, ఇతర పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకోవాలంటే హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉందని పేర్కొన్నారు. దీనికి న్యాయవాదులు చాలా సొమ్ము చెల్లించాల్సి ఉందని, అలాగే సమయం కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా తిరుపతిలో పోటీ పరీక్షలకు కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అకాడమీలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జడ్జి పోస్టుల పోటీ పరీక్షలకు మంచి కోచింగ్ ఇవ్వనున్నట్లు ఎస్ఎల్ జ్యుడిషియల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్లు యం డమూరి నాగేంద్రబాబు, ఆయన తనయుడు హైకోర్టు న్యాయవాది శరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి అర్చన, ఐదో అదనపు జిల్లా జడ్జి రామ్‌గోపాల్, తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గోపిచంద్, ప్రొఫెసర్ కృష్ణయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

కండలేరులో 6.330 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.330 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి కండలేరు జలాశయానికి 70 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో వారాహి అమ్మవారి ఆషాడ నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం అమ్మవారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి కె.రామచంద్రారెడ్డి పూజలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు కార్తికేశన్, సతీష్ శర్మ, గణేష్ శర్మ, ఆలయ సిబ్బంది శరవణ, పరంధామ రెడ్డి పాల్గొన్నారు.

కావమ్మ, మారయ్యకు వెండికిరీటాల వితరణ

శ్రీకాళహస్తి: పట్టణంలోని సంతమైదానం సమీపంలో వెలసిన కావమ్మ, మారయ్య స్వామివార్లకు పట్టణానికి చెందిన కాట్రపల్లి గోపి, రాజ్యలక్ష్మి దంపతులు ఆదివారం వెండి కిరీటాలను బహూకరించారు. వాటిని ఆలయ నిర్వాహకులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



భరత నాట్యంతో అలరిస్తున్న కళాకారులు



చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించింది. తిరుపతికి చెందిన రిషాన్వీ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా మూషిక వాహన, అదివో అల్లదివో, పుష్పాంజలి, వెంకటాచల నిలయం, నటేష కౌత్యం, వెయ్యి నామాల వాడ, బ్రహ్మమొక్కటే, కొమ్మలాల, ఒకపరి ఒకపరి, ఏకదంతాయ, శివ శివ శంకర, చూడచక్కని తల్లి, ముద్దుగారే యశోద, వచ్చెను అలమేలు మంగ తదితర పాటలకు కళాకారులు రిషిశ్రీ, అవని, వినుకన, సాయి, అక్షర, నందన, ఆగ్నిక, వేద, జ్ఞానరుతిక, హిందు, కుషి, లీలా, మోక్షిత, చతురికల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్ఆర్ జయంతి సేవా కార్యక్రమాలు

నాయుడుపేట టౌన్: మహానేత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని సోమవారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారధ్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కటకం జయరామయ్య తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి నివాళులర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

సైదాపురంలో..

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో సోమవారం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మన్నారపు రవికుమార్ యాదవ్ తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం గూడూరు పట్టణంలోని బనిగేసాహెబ్ పేటలో ఘనంగా నిర్వహించనున్నట్లు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. ముందుగా బనిగేసాహెబ్‌పేటలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని తెలిపారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. గూడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రాపూరులో..



పాపకన్ను దయాకర్‌రెడ్డి

రాపూరు: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఉదయం 9 గంటలకు రాపూరులో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పాపకన్ను దయాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక గ్రంథాలయం వద్ద ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి పంచిపెడతామని పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో రావాలని కోరారు. ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

దక్కిలిలో..

దక్కిలి : మండల కేంద్రమైన దక్కిలిలో దేవునివెల్లంపల్లి రోడ్డు సెంటర్ వద్ద సోమవారం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పెట్లూరు జగన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి చింతల శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పశుగ్రాసం పెంపకంతో దాణా ఖర్చు తగ్గుదల



పశుగ్రాసంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సురేష్

గూడూరు రూరల్ : పాడి రైతులు తమకు ఉన్న కొద్ది పాటి భూమిలో బహుళ వార్షిక పశుగ్రాసాన్ని పెంచుకుంటే దాణా ఖర్చును భారీగా తగ్గించుకోవచ్చని గూడూరు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్ తెలిపారు. ఆయన ఆదివారం గూడూరు బనిగేసాహెబ్ పేటలోని పశువైద్య కేంద్రంలో రైతులకు పశుగ్రాసం పెంపకంపై అవగాహన కల్పించారు. పశుగ్రాసం పెంచుకునే వారికి ప్రభుత్వం ఇచ్చే రాయితీల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ పశువులకు పచ్చిమేత వేయడం ద్వారా పాల దిగుబడి పెరుగుతుందన్నారు. మూడు నెలల, ఆరు నెలలు, ఏడాది పాటు ఉండే పశు గ్రాసాలు అందుబాటులో ఉన్నాయని, వీటిలో తమకు సౌలభ్యంగా ఉండే రకాలను ఎంపిక చేసుకుని సాగు చేసుకోవాలని సూచించారు.

రక్తదానంతో ప్రాణ దానం



రక్త దానం చేస్తున్న యువత

చిట్టమూరు(చిల్లకూరు) : రక్తం దానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చని విశ్రాంత ఉపాధ్యాయుడు కె.రామిశెట్టి తెలిపారు. ఆయన తన ఉపాధ్యాయ బృందం, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం చిట్టమూరు మండలం గునపాడులో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 40 మంది రక్త దానం చేశారు. ఆయన మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి రక్తం దానం చేయవచ్చన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. గునపాడులో ప్రతి ఏటా రక్త దాన శిబిరం ఏర్పాటు చేసుందుకు సహకరిస్తున్న యువత, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది రక్త దానం చేసేందుకు 8 మంది మహిళలు ముందుకు రావడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ కో ఆర్డినేటర్ మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు మురళీ, రమేష్, కస్తూరి బాబు, నారాయణరావు, అన్సర్, నాగూరు, వెంకటరమణయ్య, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

చాగంటి కోటేశ్వరరావుకు ఘన సన్మానం

నాయుడుపేట టౌన్ : ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును నాయుడుపేట చాగంటి సత్సంగ కమిటీ సభ్యులు ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. నిత్య పూజ విధానాలపై ప్రవచన కార్యక్రమాన్ని కేఎంఆర్ కన్వెక్షన్ సెంటర్‌లో రెండో కూడా నిర్వహించారు. ఆదివారం రాత్రి చాగంటి కోటేశ్వరరావు దేవుడిని పూజించే విధానాలు, పలు ఆధ్యాత్మిక అంశాలపై ప్రవచనం చేశారు. అనంతరం పట్టణానికి చెందిన చాగంటి సత్సంగ కమిటీ సభ్యులు మెంటా మల్లికార్జునరావు, మరికొంతమంది వేదపండితుల ఆధ్వర్యంలో చాంగంటి కోటేశ్వరావు దంపతులకు ఆశీర్వచనాలు అందించి ఘనంగా సత్కరించారు.

పంట మార్పిడితో చీడపీడలు దూరం



పొలసముద్రం: పంటల మార్పిడి చేస్తే తెగుళ్లను, చీడపీడలను నివారించవచ్చని పొలసముద్రం వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ పేర్కొన్నారు. తర్వాత ఎరువులు, పురుగుమందుల ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. ప్రస్తుత పంటల స్థానంలో ఏయే పంటల సాగుతో లాభాలేమిటో ఆయన వివరించారు. ఎప్పుడూ ఒకే రకమైన పంటలు సాగు చేయడం మంచిదికాదు. దీని వల్ల చీడపీడలు వృద్ధి చెందుతాయి. ఒక పంట వేసిన తరువాత వేరే పంటను సాగు చేయడంతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. కొన్ని పంటలకు తెగుళ్లు, పురుగులు ఎక్కువగా ఆశిస్తుంటాయి. చీడపీడలు ఆశించిన పంటను ఎంచుకుని సాగు చేసుకుంటే అధిక లాభం సాధించవచ్చు.

పంట మార్పిడి విధానం

- ప్రస్తుతం మెట్టలో వరికోతలు ప్రారంభమయ్యాయి. రానున్న రబీ సీజన్‌లో నీటి తడులతో ఇబ్బంది కలిగే అవకాశముంది. అందువల్ల వరికి ప్రత్యామ్నాయంగా పెసులు, వేరుశనగ వంటి నూనె గింజలు వేసుకోవడం మంచిది.
- అరటిలో ఎక్కువగా బ్యాక్టీరియా, దుంపకుళ్లు తెగుళ్లు ఆశిస్తున్న పొలాల్లో వరి, చెరకు వంటి పంటలను సాగు చేసి పంట మార్పులు చేసుకోవాలి.
- తమలపాకు తోటల్లో ఎండు తెగుళ్లు, మొదలు కుళ్లు తెగులు వ్యాపించినప్పుడు కనీసం మూడేళ్లకు ఒకసారి మొక్కజొన్న వంటి పంటలను సాగు చేసుకోవచ్చు.
- వంగ పంటలో ఆశించే ఎండు తెగులుకు నివారణ కష్టం. దీంతో ఈ తెగులు సోకిన నేలలో కాలీఫ్లవర్ వేసుకుంటే మంచిది. వంగలో నులి పురుగులు ఎక్కువగా ఉంటే తరువాత బంతి పూలు వేసుకోవాలి.
- టమాటాలో ఎండు తెగులు ఆశిస్తే ఫ్రెంచ్ చిక్కుడు సాగు చేస్తే ఆ తెగుళ్లు తగ్గుతాయి.
- కూరగాయలు, తీగజాతి కూరల తెగుళ్ల నివారణకు వరి పంట సాగుతో పంట మార్పిడి చేసుకోవాలి.
- మిరప, టమాట, వేరుశనగ, కాలీఫ్లవర్ వంటి పంటలకు ఆశించే లద్దె పురుగు నివారణకు ఆ పంట పూర్తయ్యాక, సజ్జ, జొన్న, వరి, పొద్దు తిరుగుడు తదితర ఆరుతడి పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. అలాగే బంతిపూలు, ఆవాలు వంటి పైర్లను సాగు చేస్తే ఆకు ముడత తెగులును పారదోలవచ్చు.
- పసుపు పండించిన తరువాత వరి, జొన్న సాగు చేస్తే నులిపురుగులను నివారించవచ్చు.

ఒకే కుటుంబ పంటలు వద్దు



పంటల సాగు తరచూ మారుస్తుండాలి. ఒకే కుటుంబానికి చెందిన పంటలను వేయడంతో వాటికి సోకిన తెగళ్లు, చీడపీడలు భూమిలో అలాగే ఉండిపోతాయి. తిరిగి పంట సాగు చేసిన సమయంలో ఆ పంటకు తప్పుకుండా తెగళ్లు, చీడపీడలు ఆశిస్తాయి. ఉదాహరణకు టమాట, వంగ, మిరప, బెండ పంటలు ఒకే కుటుంబానికి చెందినవి. ఇవి ఒక దాని తరువాత ఒకటి వేయడంతో గత పంటకు ఉన్న తెగుళ్లు మరొక పంటకు సోకుతాయి. కావున తరచూ పంటల మార్పిడి తప్పనిసరిగా చేయాలి. లేకుంటే పలు సమస్యలు తలెత్తుతాయి. పంటల మార్పిడి చేసుకుంటూ ఉంటే రైతులకు ఖర్చులు కూడా తగ్గుతాయి. అలాగే ఆదాయం పెరుగుతుంది.

– ఢిల్లీప్రసాద్, వ్యవసాయాధికారి